క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలలో చేర్పించాలి



బడి బయట ఉన్న పిల్లలతో ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు తెలిపారు. వారు గురువారం నీర్పాకోటలోని గిరిజన కాలనీలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బడి బయట ఉన్న ఇద్దర్ని పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రభుత్వం పిల్లల చదువుకోసం రూ.కోట్లు వెచ్చిస్తుందని తెలిపారు.

అంటరానితనం నిర్మూలనకు కృషి చేద్దాం

సత్యవేడు: అంటరానితనం నిర్మూలనకు అందరూ కృషి చేయాలని డీటీ వెంకటేశం కోరారు. గురువారం మదనంబేడు దళితవాడలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, వీఆర్వో వినోద్‌కుమార్, వీఆర్‌ఏ మునిశేఖర్, డీఆర్ మూర్తి, రాబర్ట్, జాన్ జడమ్మ, సుబ్రమణ్యం, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కలశ ప్రతిష్ఠ



కలశాలు ఊరేగిస్తున్న భక్తులు

సత్యవేడు: పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన గాలిగోపురం, రాజగోపురానికి కలశాల ప్రతిష్ఠ వేడుకగా గురువారం నిర్వహించారు. పూజల్లో భాగంగా గణపతి, గురు, సూర్యపూజ, సమంగళిపూజ, అష్టదిక్పాలక పూజ, విగ్రహాల అష్టబంధనం, గోపుర కలశాల ప్రతిష్ఠ, హోమం తదితర పూజాక్రతువులను చేశారు. సాయంత్రం 4 గంటలకు సుహాసినీ పూజ, కన్యపూజ, సుమంగళి పూజ, మూడో కాలయాగశాల పూజ, హోమం, మహాదీపారదన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇందూరు రవికుమార్, అర్చకులు మల్లికార్జున, సుబ్రమణ్యం, యోగీశ్వరయ్య, బాలాజీ, చంద్రశేఖర్, రాంప్రసాద్, గుణశేఖర్, మునిరామయ్య, అయ్యప్ప, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణతో పారదర్శకత



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆడిట్ నిర్వహణతో పారదర్శకత ఉంటుందని వెలుగు ఏపీఎం మున్నెయ్య తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఎంపిక చేసిన ఆర్‌వీఎస్ అండ్ కో సంస్థ ద్వారా ఆడిటర్లు కార్తికేయ, నారాయణ గురువారం ఆడిట్ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ. 1.13 కోట్లు నూరు శాతం రికవరీ చేసినట్లు తెలిపారు. రికార్డులను క్షుణంగా పరిశీలించారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



అక్రమంగా తరలుతున్న మట్టి

తొట్టంబేడు: మండలంలో మట్టి మాఫియా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటి వరకు గ్రామాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న కూటమి నాయకులు ప్రస్తుతం పట్టణ శివారు ప్రాంతాల్లో జేసీబీతో మట్టిని తవ్వి, ట్రాక్టర్లతో పట్టణాల్లో వెంచర్లకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా 35 వార్డు ఏం పుత్తూరులోని కదిరమ్మ గుంటలో మట్టిని కూటమి నాయకులు యథేచ్ఛగా తవ్వి, తరలిస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే తొట్టంబేడు మండలం గుండేలుగుంట చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా ఇసుక మట్టి దోపిడీకి అడ్డు అదుపూ లేకుండా పోయింది.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకరువు

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు.. నిర్మాణం పూర్తి అయితే సత్యవేడుతోపాటు 15 గ్రామాలకు ఆదరువు. అయితే వ్యయం రెట్టింపు కావడం .. భూసేకరణలో జాప్యం.. ప్రజాప్రతినిధుల ఉదాశీనత.. అధికారులు అలక్ష్యం.. ఆ ప్రాజెక్టు వెరసి 15 ఏళ్లుగా ప్రతిపాదనల దశలోనే ఆగింది.. సత్యవేడు ప్రజలకు ఎండమావిగా మిగిలింది.



సమ్మర్ స్టోరేజ్‌కు గుర్తించిన దళవాయి అగ్రహారం చెరువు



తెలుగు గంగ కాలువ సమీపంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్

సత్యవేడు: పట్టణంతోపాటు 15 గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఎండమావిగా మిగిలింది. 16 ఏళ్ల కిందట డాక్టర్ ఎన్.శివప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించి, శిలాఫలకం వేయించారు. ఈ పనుల్లో భాగంగా తెలుగు గంగ కాలువ సమీపంలో ఫిల్టర్ బెడ్, పంపింగ్ మోటారు, తెలుగుగంగ కాలువలో బోర్లు ఏర్పాటు చేశారు. ఆ తరువాత సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు ఆగిపోయాయి.

రెండోసారి ప్రతిపాదనలు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఫిల్టర్‌బెడ్, పంపింగ్ హౌస్ నిర్మించారని, గంగ కాలువ సమీపంలో చదవాలమ్మ ఆలయానికి దగ్గర భూములు గుర్తించారు. బ్యాంకు ఏర్పాటుకు మట్టి నమూనాలు సేకరించారు. ఈ స్థలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనువుగా లేదని ల్యాబ్ టెస్టులో తేలింది.

దళవాయి అగ్రహారం చెరువు ఎంపిక

దళవాయి అగ్రహారం చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. చెరువు మట్టిని సేకరించి భూ నమూనా పరీక్షకు ల్యాబ్‌కు పంపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు దళవాయి అగ్రహారం చెరువు అనువుగా ఉన్నట్లు తేలింది. చెరువు భూమిని అప్పగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇరిగేషన్ అధికారులను కోరారు. అందుకు వారు అంగీకరించారు. ఆ మేరకు అనుమతి ఇచ్చారు.

23 ఎకరాలు అవసరం

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు 28 ఎకరాలు భూమి అవసరం. చెరువు విస్తీర్ణం 18 ఎకరాలు మాత్రమే ఉంది. మరో 10 ఎకరాలు చెరువు సమీపంలోని రైతుల నుంచి భూమి సేకరించాల్సి ఉంది. పట్టా భూముల సేకరణలో అధికారులు జాప్యం చేస్తుండడంతో సమ్మర్ స్టోరేజ్ పూర్తి కాలేదు. సత్యవేడు ప్రాంతంలో ఎస్ఈజెడ్ ఉండడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో భూసేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతం భూసేకరణకు నిధులు కేటాయింపు భారీగా పెంచాల్సిన అవసరం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపాలి

రెండు పర్యాయాలు సత్యవేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్యవేడులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి వసతులకు ప్రాధాన్యత ఇస్తామంటున్న ఎమ్మెల్యే సత్యవేడులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు నిధులు సమకూర్చుతారో? లేదో వేచి చూడాల్సి ఉంది.

ఘనంగా కుంభాభిషేకం

శ్రీకాళహస్తి: మండలంలోని విశాలాక్షి నగర్‌లో నూతనంగా నిర్మించిన విజయగణపతి ఆలయంలో గురువారం మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు చేశారు. స్వామివారిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి దర్శించుకున్నారు. వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి తీర్థప్రసాదా లు అందజేశారు. సురేంద్రరెడ్డి, నవీన్, ఆంటోని, పురుషోత్తం, మౌలా, పుట్టారెడ్డి, విజయ్, మనోహర్ పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర

–గంగమ్మను దర్శించుకున్న నూకతోటి



గంగమ్మను దర్శించుకుంటున్న నూకతోటి

సత్యవేడు: మండలంలోని రాచపాళెంలో బుధ గురు వారాల్లో గంగ జాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు గురువారం ఉదయం వరకు సాగింది. భక్తులు ఇంటింటా అమ్మవారికి హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టారు. గురువారం వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ గంగమ్మను దర్శించుకున్నారు. సత్యవేడు సింగిల్ విండో మాజీ చైర్మన్ కేవీ నిరంజన్ రెడ్డి, గురుప్రసాద్, పునిదకుమార్, సోము, జోషప్, పి. మనోజ్, మణి, పురుషోత్తం, బాలాజీ, గోపికృష్ణ, రత్నయ్య, చంద్రబాబు, పి. రాజేష్, పురందర్, గంగాధరం తదితరులు ఉన్నారు.

4న నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి: ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 4న ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి చప్పరం సేవ, 5న రెండో తిరునాళ్లు, సూర్యప్రభ వాహనం, 6న మూడో తిరునాళ్లు, చంద్రప్రభ వాహనం, 7న నాలుగో తిరునాళ్లు, రాత్రి చిలుక వామనం, 8న ఉదయం కేతిగం ఉత్సవం, రాత్రి నందిసేవ, 9న ఉదయం చప్పరం, రాత్రి రథోత్సవం, 10న కేడిగం ఉత్సవం, రాత్రి కల్యాణోత్సవం, గజవాహన సేవ, 11న పార్వేట ఉత్సవం, గుంటకిందపల్లి, జింగిలిపాళెం గ్రామాలకు చప్పరం ఉత్సవం, 12న తీర్థ వారి ధ్వజావరోహణం, రాత్రి చప్పరం ఉత్సవం, 13న పల్లకీ సేవ, ఏకాంత సేవ జరుగుతుందని తెలిపారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి





బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు దళితవాడలో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్, సత్యవేడు: కార్యకర్తలతో..

బుచ్చినాయుడుకండ్రిగ: ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో గురువారం చల్లమాంబపురం, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారన్నారు. కనమనంబేడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మణినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, బాబురెడ్డి, అజయ్‌రెడ్డి, ప్రసాద్‌పాల్, దేవదాసురెడ్డి, కోటేశ్వరరావు, జయచంద్రనాయుడు, ఆశోక్, కిరణ్‌యాదవ్, వెంకటేష్, అమలింగయ్య, నాగూర్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

సత్యవేడు: అందరూ జగనన్నకు అండగా నిలిచి, సత్యవేడు నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసుకుందామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన రాచపాళెంలో కార్యకర్తలను కలసి మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో ఓ మాజీ మంత్రి అక్రమ అరెస్టు, మరో మాజీ మంత్రి ఇంట్లో విధ్వంసం జరిగితే పరామర్శించేందుకు వస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చూస్తే అధికార పార్టీకి ఎందుకో అంత భయం అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగంతో భయానక పరిస్థితి సృష్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ. మణి, పి.మనోజ్, ఏ.పురుషోత్తం, వి.బాలాజీ, పి.రత్నయ్య, ఏ.గోపికృష్ణ, పి.రాజేష్, చంద్రబాబు, పురంధర్, జీ. గంగాధరం, గురుప్రసాద్, పునిదకుమార్, పళణి, సోము, జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు జేసీబీలు, ట్రాక్టర్ సీజ్



రేణిగుంట స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన జేసీబీ

రేణిగుంట: మండలంలోని వెదుళ్లచెరువులో అక్రమంగా మట్టి తవ్వకం జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు అర్బన్ పోలీసులు దాడులు చేసి, రెండు జేసీబీ, ఒక ట్రాక్టర్‌ను స్టేషన్ తరలించారు. పోలీసుల కథనం మేరకు.. చెరువులో మట్టిని అక్రమ తవ్వకాలు జరుపుతున్నారన్న గురువారం తెల్లవారుజామున సమాచారంతో పోలీసులు చెరువు వద్దకు చేరుకుని అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కి అప్పగించారు. చట్టవిరుద్ధంగా ప్రకృతి వనరులను దోచుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు.

శుభ్రతతో మానవ మనుగడ



చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

వరదయ్యపాళెం: పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రతతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని మండల పరిషత్ ఉప అభివృద్ధి అధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని రాచర్ల, చిన్న పాండూరు, యానాదివెట్టు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటా చెత్త సేకరణను పర్యవేక్షించారు. అలాగే తడి, పొడి చెత్తపై స్థానికులకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా తడి,పొడి చెత్తను ఇళ్ల వద్ద వేర్వేరుగా నిల్వ ఉంచి పంచాయతీ ద్వారా చెత్త సేకరణకు వచ్చే బండి వద్దకు అందజేయాలన్నారు. అలాగే చిన్న పాండూరు ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర సంచులు ఎక్కడపడితే అక్కడ వేయకుండా దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలని, అలాగే ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని వారికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు గురవయ్య (యానాదివెట్టు), సునీల్ (రాచర్ల), ఈశ్వర్ రెడ్డి (చిన్న పాండూరు)లు ఉన్నారు.

ఆగని కబ్జాల పర్వం



కుచించుకుపోయిన పంటకాలువ

తొట్టంబేడు: మండలంలో కబ్జాల పర్వం ఆగడం లేదు. ప్రభుత్వ భూమి, పంట కాలువ కనిపిస్తే కబ్జాకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. అంతే కాకుండా పంట కాలువలను సైతం కబ్జా చేస్తే పంటలకు నీరు ఎలా వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. తొట్టంబేడు మండలం ఎల్ఐసీ కాలనీలోని సర్వే నంబర్ 42లో దాదాపు 23 ఎకరాలు ఈదుల గుంట చెరువు ఉంది. ఆ చెరువు నుంచి వెళ్లే పంట కాలువ కబ్జాకు గురైంది. దీంతో ఆరు అడుగుల ఉండాల్సిన కాలువ ఆరడుగుకు వచ్చింది.

బస్సు ఏర్పాటు చేయండి



డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అనుకూలంగా బస్సు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆలయాధికారులను కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ సమీకృత ప్రభుత్వ బాలుర వసతి గృహం(ఎస్సీ) పాఠశాలకు దూరంగా ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే స్కిట్ నర్సింగ్ కళాశాల వ్యాను విద్యార్థులకు సమయానుకూలంగా ఉదయం వసతిగృహం నుంచి పాఠశాలలకు, సాయంత్రం పాఠశాలల నుంచి వసతి గృహంలో వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు శివ, కార్యదర్శులు అభి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై వీరభద్రుడు



నంది వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఉత్సవర్లు నంది వాహనాన్ని అధిరోహించి, గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యకైంకర్యాలు, భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు నంది వాహనంపై ఉత్సవర్లను అధిష్ఠింపజేశారు. సుగంధ పుష్పామాలికలు, పట్టువస్త్రాలను ధరించిన వీరభద్రుడు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉర్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి శేషవాహనాన్ని అధిరోహించి వీరభద్రస్వామిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకించండి

తిరుపతి కల్చరల్: స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ నేత ఎన్.డీ.రవి, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నేత పి.వెంకటరత్నం పిలుపు నిచ్చారు. సామాన్యులకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష నేతల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్యనగర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రిది ఒక మాట, అధికారుల మాటలు మరో మాటగా ఉందన్నారు. ఆదాని కంపెనీ స్మార్ట్ మీటర్లను దొంగల మాదిరిగా ఇళ్లల్లో ఎవరూ లేనప్పుడు వచ్చి అమర్చుతున్నారన్నారు. ప్రజల అంగీకారం ఆమోదం లేనిదే మీటర్లను అమర్చవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారన్నారు. అయితే ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి విద్యానంద్ మాత్రం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు త్వరగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించడం అంటే మంత్రి మాటకు ఏ మాత్రం లెక్క చేయడం లేదన్న విషయం బహిర్గమవుతోందన్నారు.

క్వారీ తవ్వకాలు ఆపాలి



రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సత్యవేడు: చమర్తికండ్రిగ గిరిజన కాలనీకి సమీపంలోని అడవికి వెళ్లే దారిలో క్వారీ తవ్వకాలు ఆపాలని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలసి సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ చమర్తికండ్రిగ సమీపంలో క్వారీ తవ్వకాల కారణంగా ఏర్పడిన గుంతలు బావులను తలపిస్తున్నాయని, గిరిజనలు అటవీ ప్రాంతాని వెళ్లేందుకు వీలు లేకుండా గోతులు తీస్తున్నారని ఆరోపించారు. అడవి ఫలసాయంపై ఆధారపడ్డ గిరిజనులు అడవిలోకి వెళ్లేందుకు వీలు లేకుండా 30 నుంచి 40 అడుగుల లోతు గోతులు తీస్తున్నారన్నారు. క్వారీలు యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర సర్వే చేసి గిరిజనులు, దళితులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, మురళి, ధనంజయులు, గిరిజన సంఘం నాయకులు శ్రీనివాసులు, సుధాకర్, చిరంజీవి, రవి పూలమ్మ, గోవిందమ్మ, చెంచమ్మ పాల్గొన్నారు.

గంగ జాతర తేదీలు ఖరారు

- 5వ తేదీన చాటింపు
- 11 నుంచి 13 వరకు జాతర



రేణిగుంట గంగమ్మ

రేణిగుంట: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే రేణిగుంట గంగ జాతర ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులుపాటు నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేశారు. గంగ జాతరకు ఐదో తేదీ మంగళవారం రాత్రి చాటింపు వేయనున్నారు. గురువారం గంగమ్మ ఆలయంలో జరిగిన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గంగ జాతర ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు అందరం సంసిద్ధం అయ్యామన్నారు. ప్రతి ఒక్కరి సహకారంతో గంగ జాతరను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, జ్యోతినారాయణ, లక్ష్మణ్ రెడ్డి, ఉమేష్, రావణ, రేణు, చిన్నబాబు, సురేష్, భాస్కర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు సహకరించండి

శ్రీకాళహస్తి: నిరుపేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్పొరేట్ సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్ అతిథి గృహంలో గురువారం పీ4పై అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 11,866 మంది పేదలను గుర్తించామన్నారు. 2,367 మంది కుటుంబాలను 38 మంది పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన పేదలను కూడా దత్తత తీసుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం మాకొద్దు

- ఆటో చార్జీలు భరించలేకున్నాం
- లక్ష్మీపురం గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న లక్ష్మీపురం మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన గ్రామస్తులు రేషన్ సరుకులు తమకు వద్దంటున్నారు. రేషన్ దుకాణం4 కి.మీల దూరంలో ఉన్న సీఎల్ఎన్‌పల్లిలో ఉంది. అక్కడకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలంటే ఆటోలో వెళ్లాలి. ఆటో చార్జీ రూ.40 పైమాటే. దీంతో రేషన్ సరుకులకు చెల్లించే నగదు కంటే ఆటో చార్జీలే ఎక్కువవుతున్నాయని, ఆ నగదు తాము భరించలేమంటూ ఏకంగా రేషన్ సరుకులే తీసుకోవడం మానేస్తున్నామని లక్ష్మీపురం మహిళలు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బండి ద్వారా ఇంటి వద్దకే సరుకులు అందేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బండ్లను రద్దు చేయడంతో తమ గ్రామానికి రేషన్ కష్టాలు మొదలయ్యాయని ఆవేదన చెందుతున్నారు.